# 1

# పరలోక రాజ్య పౌరులం!

## (మత్తయి 5:1-12)

మత్తయి 5-7 వాక్యభాగాన్ని "ప్రపంచ సాహిత్యములో అత్యున్నత చర్చగా,"[1] "రారాజుల మేనిఫెస్టోగా," "భక్తి జీవితానికి మూల గ్రంథముగా," "సంఘ శాసన గ్రంథముగా," "పరలోక రాజ్యపు నియమావళిగా" పేర్కొంటారు. ప్రాచుర్యం పొందిన దీనిని "కొండ మీద ప్రసంగంగా"[2] ఆగస్టీన్ భక్తుడు నాలుగవ శతాబ్దంలో పిలిచాడు. వేలకొద్ది పుస్తకాలు, ప్రసంగాలు, వ్యాసాలు, పాఠాలు దీని ఆధారంగా వెలువడ్డాయి. మనం ఎలా జీవించాలన్న విషయాన్ని యిది తెలియజేస్తుందని ఎక్కువమంది అభిప్రాయబడుతుంటారు.

అయితే, యేసుప్రభువు చేసిన ప్రసంగాల్లో ఇదొక్కటే అత్యుత్తమమైనది కాదు గాని, ఎక్కువమంది అర్థంచేసుకునేలా, అనుసరించేలా ఉంటుంది.[3] దీని గురించి మన పాఠమును ప్రారంభిస్తుండగా, దీనిని మీరు బాగుగా అర్థంచేసికొనుటకు ఈ పాఠము ఉపకరిస్తుందని నేను ప్రార్థిస్తున్నాను. ఈ ప్రసంగంలోని విషయాలకు మీరు లోబడి అనుసరించేలా ఇది మిమల్ని ప్రోత్సహిస్తుందని నేను ఆశిస్తున్నాను (మత్తయి 7:24-27ను చూడు).

### మన అధ్యయనం కొరకు సిద్ధపాటు

#### కొన్ని సంబంధం లేని విషయాలు

మత్తయి 5:1-12 వాక్య భాగమును అధ్యయనం చేసేముందు, దీని పూర్వపరాలను పరిశీలిద్దాం. కొన్ని సంబంధం లేని విషయాలను మీ ముందు ఉంచాలనుకుంటున్నాను. మొదటిగా, *యేసు ప్రభువు యొక్క బోధనల పూర్తి సారాంశమే ఈ కొండమీది ప్రసంగం కాదు* అన్న విషయాన్ని నొక్కి చెప్తున్నాను. మత్తయి 5-7 వాక్యభాగంలో అనేక ముఖ్య అంశాలున్నాయి. కాని, వాటిని మాత్రమే గ్రహించి, మిగిలిన ప్రభువు బోధనలను మనం వదిలివేయము.

కొంతమంది కొండమీది ప్రసంగం మీదనే దృష్టి సారించాలని భావిస్తుంటారు. "బోధకులు చెప్పే ఇతర విషయాలను గురించి నేను పట్టించుకోను, కొండమీది ప్రసంగం ఆధారంగానే నేను జీవిస్తాను" అని వారు గ్రుడ్డిగా చెప్తారు. కొండ మీది ప్రసంగం ఆధారంగా జీవించడం చాలా సులభమన్న ధోరణిలో వారుంటారు. యిటువంటప్పుడు వారు ప్రసంగ వాదాన్ని సరిగానే అర్థంచేసుకున్నారా అన్న సంశయం కలుగుతుంది (ఉదాహరణకు 5:39ను చూడు).

యేసు ప్రభువు మన పాపముల కొరకు చనిపోయారన్న సువార్తను ప్రసంగంనుండి తప్పించడం మరో పెద్ద పొరపాటు. కొండమీది ప్రసంగం గురించి చార్లెస్. ఆర్. ఎడ్మాన్ తన పరిశీలనాత్మక అభిప్రాయాన్ని ఇలా చెబుతున్నాడు:

ఇది రాజ్యపు ప్రాథమిక సూత్రాలను తెలియజేస్తుంది. అయితే, క్రీస్తు ప్రభుని విమోచనా కార్యం, దైవిక సత్యము గురించి గాక, ఇతర విషయాల్లో వినువారి హృదయాన్ని కొంత అయోమయానికి గురిచేస్తుంది.

మనకు ఈ ప్రసంగమే ఏకైక వాక్యభాగముగా ఉన్నట్లయితే, ఇందులోని దైవిక భావాలు, ఖచ్చితమైన ప్రవర్తనా నియావళిని బట్టి మనమందరము దోషులుగా పిలువబడవలసిందేనని ఎర్డ్మన్ పేర్కొన్నాడు. దేవుని సహాయం లేకుండా ఏ వ్యక్తీ కూడ యిటువంటి నియమ నిబంధనలను అనుసరించలేడు.[4]

కాబట్టి, కొండమీది ప్రసంగం మాత్రమే యేసు ప్రభుని బోధనల సారాంశం కాదన్న విషయన్ని మరోసారి గుర్తుచేస్తున్నాను. క్రీస్తు రాజ్యపు పౌరునిగా, వారసునిగా మనమెలా ఉండాలన్న విషయాన్ని ఇది తెలియజేస్తుంది. అయితే, ఆయనను వెంబడించువారముగ మనము నేర్చుకొనవలసినది ఇది గాక ఇంకా ఉంది.

రెండవదిగా, *తన సహ జాతివారైన యూదులను తిరిగి మోషే ధర్మశాస్త్రము వద్దకు మళ్ళించడం యేసుని ఉద్దేశం కాదు.* పాత నిబంధనలోని బోధనలను పునరుద్ధరించడానికి యేసు ప్రభువు చేసిన ప్రయత్నమే ఈ ప్రసంగం అని కొంతమంది చెప్తుంటారు. ఇది నిజమే, ఎందుకంటే, పాత నిబంధనపు కాలములో ఉన్న యూదులకు ప్రభువు ఈ ప్రసంగాన్ని బోధించారు.[5] అందుకనే, ఇందులో బలిపీఠము యొద్ద అర్పణము అర్పించడం వంటి పాత నిబంధన కాలపు ఆచారాలు (23, 24 వచనాలు), పాత నిబంధనకు సంబంధించిన వాక్య భాగాలు (5:21)ను చూడగలము.[6] ఏదేమైనా, గతమును నిర్లక్ష పెట్టకుండా, భవిష్యత్తు కొరకు ప్రభువు ఈ క్రొత్త మార్గాన్ని ఏర్పరుస్తున్నారు. 5వ అధ్యాయాన్ని గమనించండి, "... చెప్పబడిన మాట విన్నారు గదా ... నేను మీతో చెప్పునదేమనగా ..." వంటి మాటలను ప్రభువు ఎన్నిసార్లు ఉపయోగించారో గమనించండి (21, 22, 27, 28, 33, 34, 38, 39, 43, 44 వచనాలు). ప్రభువు యిక్కడ మోషే అధికారముతోగాక లేఖన అధికారముతో బోధించాడు (7:28, 29 చూడు).

మూడవది (మరియు బహుశ ముఖ్యమైనదిగా), *కొండ మీది ప్రసంగం అసాధ్యమైన లక్ష్యాన్ని ఉంచడం లేదు.* ఇది ఒక అసాధ్యమైన జీవిత దిశను నిర్దేశిస్తుంది కాబట్టి, "దీనిని ఎందుకు ప్రయత్నించి చూడాలి?" అన్న ఉద్దేశంతో కొందరు దీన్ని నిర్లక్ష్యం చేస్తుంటే, మరికొందరు, ప్రసంగంలోని అంశాలు 21వ శతాబ్దపు ప్రజల కొరకు ఉద్దేశించబడినవి కావు అని వాదిస్తుంటారు. యేసు ప్రభువు తాను త్వరలో స్థాపించబోయే ఇహలోక రాజ్యమునకు తన కాలంలోని తన శిష్యులకు మాత్రమే ఈ అంశాలు ఉద్దేశించబడినవి అని వారు చెప్తుంటారు. ఇటువంటి అభిప్రాయం క్రీస్తుకు (దేవుని ప్రణాళిక ఎరుగని వాడుగా ఇది ఆయన్ను చూపిస్తుంది కాబట్టి), అలాగే లేఖనమును ప్రేరేపించిన పరిశుద్ధాత్మనికి (ఆయన వాక్యం అన్ని కాలములకు చెందనదిగా ఇది చూపిస్తుంది కాబట్టి) అవమానమును కలుగజేస్తుంది.

నిజం చెప్పాలంటే, కొండమీది ప్రసంగంలో ప్రస్తావించబడిన అంశాలను మన దైనందిన జీవితంలో అనుసరించడం కష్టం. ప్రసంగంలోని విలువల స్థాయకి నేను సరితూగనని ఒప్పుకుంటున్నాను. ప్రభుని మార్గదర్శక సూత్రాలను అనుసరించుటకే నేనెంతో పోరాడుచున్నాను. ఈ భూమిమీద నా చివరి శ్వాస వరకూ పోరాడుతునే ఉంటాను. దీనర్థం, ప్రసంగంలో నిర్దేశించబడిన అంశాలు అసాధ్యమనో లేక వాటి స్థాయికి తగ్గట్టుగా మనం

ఉండతామనో కాదు. పర్వత ప్రసంగంలోని విలువలను బలహీనపర్చి చెప్పడం ద్వారా మన మాటలను వింటున్న వారికి మనం అపకారం చేసినవారమవుతాము. మత్తయి 5–7 వాక్య భాగం గురించి జి. కె. ఛెస్టర్టన్ చెప్పిన మాటలను పరిశీలిద్దాం:

> మొదటిసారి దీనిని మీరు చదివినప్పుడు, అంతా తలక్రిందులయినట్టుగా అనిపిస్తుంది. అయితే, రెండవదిగా మరలా దీనిని చదివినప్పుడు అంతా సరైన దిశలోనే అన్నట్లు మీరు గుర్తిస్తారు. మొదటిసారి మీరు చదివినప్పుడు ఇది అసాధ్యం అనిపిస్తుంది. రెండవసారి చదివినప్పుడు అసాధ్యమైనదేదియు లేదు అని అన్పిస్తుంది.[7]

*కొండ మీది ప్రసంగ వాదాలను అధ్యయనం చేస్తుండగా, మనమందరం కూడ ఇందులోని విలువలకు తగినట్లుగా ఉండడానికి మనం సవాలు చేయబడతాం.* ఇందుకోసం మనం ఏమైయుండాలో, ఏమి చేయాలో అందుకు తగిన శక్తిని, సహాయమును దయచేయమని దేవున్ని అడుగుదాం. తరువాత, మనం ఎంత ప్రయత్నించినా, ఇందులో విఫలమవుతుంటే, మనల్ను మనం దేవుని కృపకు అప్పగించుకుందాం.

## చర్చ

పాఠములోనికి వెళ్ళకముందు మరికొన్ని విషయాలను చర్చిద్దాం. ఉదాహరణకు, మత్తయి 5–7లో చెప్పబడిన ప్రసంగం మరియు లూకా 6వ అధ్యాయములో చెప్పబడిన మైదానమందలి ప్రసంగం రెండూ ఒకటేనా అని కొందరు చర్చింస్తుంటారు. ఈ రెండూ వేర్వేరు ప్రసంగాలని చాలా కాలం క్రితం అనేకమంది భావించేవారు. కానీ, ఈ రోజున అవి ఒకే ప్రసంగము రెండు విధాలుగా చెప్తున్నారు. ఈ ప్రశ్నకు మనం సమాధానం ఇవ్వలేము. అలాగే మనం దీనిని పరిష్కరించామా లేదా అన్నది ప్రధానం కాదు. ఇవి రెండు ప్రసంగాలైనా, లేక ఒకే ప్రసంగపు రెండు కధనాలైనా, వీటిని పోలిస్తే ఈ రెండింటికి ఎంతో సారూప్యముంది. ముఖ్యంగా మనం మత్తయి యొక్క కధనాన్ని పరశీలిస్తున్నాగాని, మధ్యలో లూకా యొక్క కధనాన్ని కూడ పరిగణలోకి తీసుకుంటున్నాం.

గతచరిత్రను గురించి మరో విషయాన్నికూడ గమనించండి. ఈ పాఠాలను తయారు చేస్తుండగా, ప్రభువు యొక్క మాటలను మీతో నేరుగా సంభాషించుటతో పాటు, ప్రతి పదాన్ని సున్నితంగా పరిశీలించి, పరీక్షించి దాని అర్ధాన్ని రాబట్టుటలో నేను జాగ్రత్తపడ్డాను. పువ్వులోని ప్రతి పూరేకును విరగ్గొట్టి, దానిని క్షుణ్ణంగా పరీక్షించుట ద్వారా ఆ పువ్వును దాని అందాన్ని పాడుచేసిన వారమవుతాము. ప్రతి పదాన్ని నేను పరిశీలిస్తాను. అయినప్పటికీ, అవి ప్రభు యొక్క భావాన్ని మార్చకుండా ఉండాలని ప్రార్థిస్తున్నాను. అయితే, అది ఆ పదాలమీద వెలుగును ప్రసరించి ప్రభుని మాటలకు మరింత అందం, అర్థం చేకూర్చగలవని భావిస్తున్నాను. కొండమీద ప్రసంగమును గూర్చి యితరులు వ్రాసిన దానిని చదివి ఇంతకు తప్ప మరేమియూ నేను నేర్చుకొనలేదు: సాటిలేని ప్రసంగమును గూర్చి చెప్పవలసినవి యింకా ఎంతో ఉన్నాయి.

ఈ పరిచయ విషయాలు చాలని నేను భావిస్తున్నాను. మత్తయి 5వ అధ్యాయంలోని ప్రారంభ వాక్యాలను అధ్యయనం చేస్తుండగా మరిన్ని తత్సంబంధ విషయాలను నేర్చు కుంటాము.

## ప్రసంగం కొరకు సిద్ధపాటు (5:1, 2)

### సన్నివేశం

"ఆయన ఆ జనసమూహము చూచి కొండ యెక్కి ..." అన్న మాటలతో 5వ అధ్యాయం ప్రారంభమవుతుంది (5:1ఎ, బి). ప్రభువు చూసిన ఆ జనసమూహమును గురించి మునుపటి అధ్యాయం చివరి వచనంలో పేర్కొనబడింది: "గలిలయ, దెకపోలి, యెరూషలేము, యూదయయను ప్రదేశములనుండియు యొర్దానునకు అవతలనుండియు బహు జనసమూహములు ఆయనను వెంబడించెను" (4:25).

మత్తయి 4వ అధ్యాయములో గలిలయ ప్రాంతములయందలి "గొప్ప పరిచర్యకు" ఆరంభమును మనం చూస్తాము. ప్రభువు ఈ లోకములో చేసిన పరిచర్యలో ఇది ఒకటిన్నర సంవత్సరముల పరిచర్య. యేసు ప్రభువు యూదయ ప్రాంతములలో పరిచర్య చేస్తుండగా (యోహాను 3:22–24ను చూడు), "బాప్తిస్మమిచ్చు యోహానును" హేరోదు బంధించి చెరసాలలో వేయించాడని ఎరిగి (మత్తయి 14:3) ఆయన గలిలయకు తిరిగి వచ్చాడు (మత్తయి 4:12). గలిలయలోనే యేసు ప్రభువు తన మొదటి ముప్పది సంవత్సరముల కాలాన్ని గడిపాడు. ఆయన ఈ ప్రాంతమునకు తిరిగివచ్చిన తరువాత, తన దగ్గర శిష్యత్వమునకు మనుష్యులను పిలిచాడు (18–22 వచనాలు). "ఆయన వారి సమాజ మందిరములలో బోధించుచూ, (దేవుని) రాజ్యమును గూర్చిన సువార్తను ప్రకటించుచు, ప్రజలలోని ప్రతి వ్యాధిని, రోగమును స్వస్థపరచుచు, గలిలయ యందంతట సంచరించెను" (23 వచనం). "పరలోక రాజ్యము సమీపించియున్నది గనుక మారుమనస్సు పొందుడి" (17 వచనం) అన్నదే ఆయన రాజ్య సువార్త ప్రకటన. వెంటనే "గొప్ప జన సమూహములు ఆయనను వెంబడించెను" (25 వచనం). ఆ జనసమూహమును చూసి ప్రభువు "కొండ యెక్కెను" (5:1బి). బహుశ, ఆయన ఆ జనసమూహమును తప్పించుకోవాలని భావించియుండవచ్చు లేదా తన మాటలను వారికి వినిపించాలని అనుకూల ప్రదేశాన్ని ఆయన ఎన్నుకుని ఉండవచ్చు.

ప్రభువు "ఎక్కిన" ఆ "కొండ" ఏదో మనకు స్పష్టంగా తెలియదు. సాధారణంగా దీనిని Horns of Hatlin అని చెప్తారు కాని, ఇదే ఆ ప్రదేశం అని ఖచ్చితంగా చెప్పలేము. కొండ (mountain, *oros*), అను పదమును "కొండ" (hill) అను అర్థముతో అనువదించ బడింది. (ఇదే గ్రీకు పదము 5:14లో ఉపయోగించబడింది, ఇది "కొండ మీదనుండు పట్టణము" గురించి మాట్లాడుతున్నది.) కొండ (mountain) అను పదమునకు ముందు ఇంగ్లీషు బైబిలులో వాడబడిన నిర్దిష్టిత ఉప పదం (the) ప్రాధాన్యతను లేక ఖచ్చితమైన కొండను చూపించేది కాదు. జోసఫ్ హెచ్. థేయర్స్ యొక్క నిఘంటువు ప్రకారం ఈ పదము "చెప్పబడ్డ ప్రదేశమునకు దగ్గరి కొండ, దగ్గరి ప్రాంతంలోని కొండగాను"[8] సూచిస్తుంది. గలిలయ సముద్ర ప్రాంతమునకు పశ్చిమ వైపున ఉన్న ఎతైన కొండలలో ఒక దానిపై నుండి ఈ ప్రసంగం వెలువడియుండవచ్చు.

మన వాక్య భాగమునకు తిరిగివస్తే, "... కూర్చుండగా, ఆయన శిష్యులాయనయొద్దకు వచ్చిరి" (1సి, డి వచనం) అని చదువుతాము. కూర్చుని ఉండడం సాధారణ బోధనా పద్ధతులతో ఒక విధానం (13:2; 23:2; 24:3; 26:55ను చూడు). యూదుల సమాజ మందిరాలలో బోధకులు సాధారణంగా కూర్చుని బోధిస్తారు (లూకా 4:20 చూడు).

"ఆయన *శిష్యులాయనయొద్దకు* వచ్చిరి"[9] అనే వాక్యం చెబుతున్న విషయాన్ని గమనించండి. "అప్పుడాయన నోరు తెరచి ఈలాగు (*వారికి*) బోధింపసాగెను" అని తరువాత వచనం చెబుతున్నది. లూకా వివరణ ప్రకారం, ఈ ప్రసంగానికి ముందు ప్రభువు పన్నెండు మంది అపొస్తలులను ఎన్నుకున్నారు (లూకా 6:12–16 చూడు). ఒకవేళ ఇదే నిజమైతే, "కొత్తగా ఎన్నుకోబడ్డ పన్నెండుమంది అపొస్తలులకు ఇది ప్రారంభ తరగతిలాంటిది."[10] ఏదేమైనా, పంద్రెండుమంది గాక ప్రభువు మరికొంతమందిని శిష్యులనుగా ఎన్నుకున్నారు (లూకా 10:1 చూడు). బోధించువానిని అనుసరించి నేర్చుకునే వాడే శిష్యుడు. మత్తయి 5:1లో పేర్కొనబడ్డ శిష్యులు యేసును అంటిపెట్టుకొనియున్నవారు. వారు నిజమైన విద్యార్థులు.

మరో విధంగా చెప్పాలంటే, కొండమీది ప్రసంగం ప్రతి ఒక్కరినీ ఉద్దేశించినది, ఎందుకంటే, ప్రతి ఒక్కరూ తన శిష్యులు కావలెనని ప్రభువు మాట్లాడుతున్నప్పుడు జన సమూహము అక్కడ ఉన్నట్టుగా మనం చూస్తాం (7:28–8:1 చూడు). వివరంగా చెప్పాలంటే, ప్రభువు శిష్యులు మాత్రమే ప్రసంగాన్ని అర్థం చేసుకొని, గ్రహించి, అందులోని విషయాలను అనుసరిస్తారు. "నాకు వేరుగా ఉండి మీరేమియు చేయలేరు ..." (యోహాను 15:5) అని ప్రభువు మరోచోట తెలియజేస్తున్నారు.

ఈ దృశ్యాన్ని మీ మనస్సులో ఊహించండి.[11] ప్రభువు అనుకూల స్థలాన్ని ఎన్నుకుని కూర్చున్నారు. తరువాత ఆయన శిష్యులు (నేర్చుకొనుటయందు ఆసక్తిగలవారు) ఆయన చుట్టు కూర్చున్నారు. చివరిగా, నేర్చుకొనుట కంటే, ఏం జరుగుతుందాయన్న ఆసక్తి గల జన సమూహం శిష్యుల వెనుక నిలబడియున్నారు. ప్రభువు మాట్లాడుతుండగా, నెమ్మదిగా జనం పెరుగుతూ ఉన్నారు.

**మాట్లాడుట**

"అప్పుడాయన నోరు తెరచి ఈలాగు (వారికి) బోధింపసాగెను" (మత్తయి 5:2) అని తరువాత వాక్యం అంటుంది. "అప్పుడాయన నోరు తెరచి" అన్న మాటకు, "మాట్లాడుటకు ఆయన నోరు తెరచెను" అని అర్థము. ఈ మాట "హెబ్రీ వ్యాకరణమునకు చెందినది (హెబ్రీ భావం). ఈ మాటలు అనుకోకుండా మాట్లాడినవి కావు, ప్రత్యేక ఉద్దేశముతో మాట్లాడుటను సూచిస్తుంది."[12] యేసు ప్రభువు "ఈలాగు బోధింపసాగెను" – ఈ విధముగా ఆయన బోధనాత్మక చర్చ ఆరంభమయింది.

యేసు, తాను త్వరలో–స్థాపించబోయే–రాజ్యము గరించి ఇదివరకే బోధించాడు:

> అప్పటినుండే యేసు – పరలోక రాజ్యము సమీపించియున్నది గనుక మారుమనస్సు పొందుడని చెప్పుచు ప్రకటింప మొదలు పెట్టెను (4:17).
>
> యేసు వారు సమాజ మందిరములో బోధించుచు, (దేవుని) రాజ్యమును గూర్చిన సువార్తను ప్రకటించుచు ... గలిలయయందంతట సంచరించెను (4:23).

మత్తయి 5–7లోని బోధనలలోనూ రాజ్యమును గూర్చిన అంశం కొనసాగింది. ఈ ప్రసంగంలో ఎన్నిసార్లు "రాజ్యము" గురించి ప్రస్తావించబడిందో గమనించండి (5:3, 10, 19, 20; 6:10, 13, 33; 7:21). ప్రత్యేకించి, ప్రతి వచనం యొక్క సందర్భములను గమనించండి. ఈ ప్రసంగాన్ని అధ్యయనం చేస్తుండగా, రాజ్యపు స్వభావాన్ని (భౌతికంగా గాక,

ఆత్మీయంగా) మరియు రారాజు మననుండి కోరే సమర్పణను నేర్చుకొనగలం. అన్నిటికంటే ముఖ్యముగా, క్రీస్తు రాజ్యములో పౌరసత్వపు నిరూపణను గూర్చి నేర్చుకొందుము: పరలోక రాజ్య పౌరులు ఎవరు మరియు వారు ఏమి చేస్తారు అన్న విషయాలను నేర్చుకుంటాం.

మత్తయి 5:1, 2 వాక్య భాగాలు కొండమీది ప్రసంగంలోని భాగము కాదని, యేసు ప్రభువు యొక్క బోధనలలో ఒక భాగమును మత్తయి యిక్కడ చేర్చాడని కొందరు భావిస్తుంటారు. ఒకవేళ మత్తయి వివరణను మనము నమ్ముతున్నట్టయితే అలాంటి ముగింపునకు వచ్చుటకు ఏ కారణమూ లేదు. "మత్తయి ఈ ప్రసంగమును ఒకానొక స్థలములో, ఒకానొక సమయములో చేసిన ప్రసంగం" (5:1; 8:1 చూడు).[13] అలాగే, మనకియ్యబడిన ప్రసంగ పాఠం క్లుప్తీకరించబడింది (ఈ వాక్య భాగాన్ని బిగ్గరగా చదవడానికి పది లేదా పదిహేను నిమిషాలు పడుతుంది). యేసు బోధిస్తూ మధ్యలో విశ్రాంతి తీసుకుని ఉండవచ్చు. మరియు దీర్ఘకాలం బోధించి యుండవచ్చు మత్తయి 5–7 వాక్య భాగాన్ని కొంతమంది "కొండమీది ఉపదేశంగా" పిలుస్తారు.[14] మత్తయి వ్రాసిన ఈ మూడు అధ్యాయాలలోని ప్రసంగ పాఠము యేసు క్రీస్తు తన శిష్యులకు బోధిస్తుండగా, అక్కడ చేరిన జనసమూహము కూడ దీనిని విన్నారు. ఎవరైతే తమ జీవితాలను ప్రభువుకు సమర్పించుకొనడానికి ఇష్టపడుతున్నారో వారికందరికీ ఈ ప్రసంగం ఉద్దేశించబడింది.

## పౌరసత్వము కొరకు సిద్ధపాటు (5:3–12)

ఈ ప్రారంభ పాఠములో, ప్రసంగములోని మొదటి భాగమైన ధన్యతలు గురించి ఒకసారి గమించుదాం:[15]

> "ఆత్మ విషయమై దీనులైనవారు ధన్యులు; పరలోక రాజ్యము వారిది."
> "దుఃఖపడువారు ధన్యులు; వారు ఓదార్చబడుదురు."
> "సాత్వికులు ధన్యులు; వారు భూలోకమును స్వతంత్రించుకొందురు."
> "నీతికొరకు ఆకలిదప్పులుగలవారు ధన్యులు; వారు తృప్తిపరచబడుదురు."
> "కనికరముగలవారు ధన్యులు; వారు కనికరము పొందుదురు."
> "హృదయశుద్ధిగలవారు ధన్యులు; వారు దేవుని చూచెదరు."
> "సమాధానపరచువారు ధన్యులు; వారు దేవుని కుమారులనబడుదురు."
> "నీతి నిమిత్తము హింసింపబడువారు ధన్యులు; పరలోక రాజ్యము వారిది."
> "నా నిమిత్తము జనులు మిమ్మును నిందించి, హింసించి మీ మీద అబద్ధముగా చెడ్డ మాటలెల్ల పలుకునప్పుడు మీరు ధన్యులు. సంతోషించి ఆనందించుడి పరలోకమందు మీ ఫలము అధికముగును. ఈలాగున వారు మీకు పూర్వమందుండిన ప్రవక్తలను హింసించిరి" (5:3–12).

మనమిక్కడ ఎనిమిది ధన్యతలను చూస్తాము. యిక్కడ వాడబడిన పదరూపము ("ధన్యులు") బైబిల్‌లో అసాధరణమైనది కాదు.[16] కానీ వాక్యములో ఎక్కడా కూడ "ఇంత పొడువాటి, క్రమబద్ధమైన ధన్యతల నిర్మాణం"[17] లేదు.

వివరణాత్మకంగా చెప్పబడిన ఎనిమిదవ ధన్యత వివరణను పక్కనబెడితే, ప్రతి ధన్యతలోనూ మూడు భాగాలు ఉన్నాయి: ఒక ధన్యత, ఒక లక్షణం, మరియు ఒక ప్రతిఫలం వంటి మూడు గుణాలున్నాయి. ఉదాహరణకు, ధన్యతతో మొదట ఆరంభిస్తుంది: "ధన్యులు." తరువాత అది పరలోక రాజ్య పౌరసత్వమునకు గల ఒక గుణలక్షణమును యిస్తుంది: "ఆత్మ

విషయమై దీనులైనవారు ...” అది వాగ్దానములో ముగుస్తుంది: “పరలోక రాజ్యము వారిది.” ఈ క్లుప్త వివరణలో ధన్యతలోని మూడు భాగాలను పరిశీలించుదాం.

**ధన్యత**

“ధన్యులు” అనుమాట *makarios* అను గ్రీకు పదమునుండి అనువదించబడింది. దీని అర్థం “ధన్యత” లేదా “సంతోషం.” “అభినందించదగ్గవారు లేదా సంతోషకరమైన జీవితాన్ని కలిగియుండేవారని ఈ పదం సూచిస్తుంది.”[18] దేవుడు తన పిల్లలు సంతోషపడుటకు ఇష్టపడడని కొందరంటారు. కాని యిది దుష్టుని అబద్ధం. దేవుడు ఆదిమ దంపతులను ఎలుకలు తిరుగాడే మురికి కూపాల్లోనో లేక వ్యాధులు విస్తరింస్తున్న బురదకూపాల్లోనో ఉంచలేదు. ఆయన వారిని మంచి చోటులోనే ఉంచాడు. (పాపము ఈ లోకానికి దుఃఖాన్ని శాపమును కలుగజేసింది.) “సంతోషము” అను పదమును ఈ లోక సంబంధ భావాలకు అన్వయించినంత వరకు *makarios* అనే పదాన్ని “సంతోషంగా”[19] అనువదించవచ్చు. రెండు మార్గాలలో సంతోషాన్ని పొందవచ్చునని రాల్ఫ్ స్వీట్ అనునతడు వివరిస్తున్నాడు.[20] ఒక వ్యక్తికున్న ప్రతి ఆశకూడ తీర్చబడేలా తగిన పరిస్థితులను కల్పించడము ఒక మార్గము. ఇది లోకానుసార మార్గము. ఇది అధోగతికి మార్గము. అయితే, ఏ పరిస్థితుల్లోనైనా, సంతోషముగా ఉండేలా ఒక వ్యక్తి యొక్క వ్యక్తిత్వ, గుణగణాలను తీర్చిదిద్దడం రెండవ మార్గము. ధన్యతల యొక్క ప్రయత్నమూ ఇదే.

**లక్షణాలు**

మనము సంతోషించే వారముగా, ధన్యులుగా ఉండడానికి ఎటువంటి వ్యక్తిత్వ లక్షణాలను కలిగియుండాలి?[21]

- మనం “ఆత్మ విషయై దీనులై ఉండాలి,” మన యొక్క ఆత్మీయ దీనస్థితిని గమనించుకోవాలి.
- మన ఆత్మీయ హీన స్థితిబట్టి మనం “దుఃఖపడాలి.”
- మనం “సాత్వీక” మనస్సు కలిగి దేవునికి, ఆయన వాక్యానికి లోబడి యుండాలి.
- దేవుని చేత నీతిమంతునిగా పిలువబడాలనే దృఢనిశ్చయం కలిగి “నీతి కొరకు ఆకలిదప్పులు” కలిగియుండాలి.
- మన గురించి మనకంటే, యితరుల గురించి దయగలిగి, వారి పట్ల “కనికరము” కలిగియుండాలి.
- పరిశుద్ధము మరియు స్వచ్ఛమైన హృదయము గలవారమై దేవుని విషయాలపై దృష్టియుంచి “హృదయ శుద్ధి” గలవారమైయుండాలి.
- దేవునితో మరియు యితరులతో సమాధానము కలిగియుండుటకు ప్రయాస పడుతూ “సమాధానపరచువారుగా” మనముండాలి.
- “నీతి నిమిత్తము హింసింపబడుతున్న” సమయంలో కూడ క్రీస్తు యెడల విశ్వాస్యత కలవారమైయుండాలి.

క్రీస్తు రాజ్యపు వారసులు, సాతానుడి రాజ్యపు వారసులకంటే విభిన్నమైనవారు. కొండమీది ప్రసంగంలో ఆదినుండి అంతం వరకు కూడ ప్రభువు ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. "మీరు వారివలె ఉండకుడి ..." మత్తయి 6:8 అన్న వాక్యమును ప్రసంగం యొక్క ముఖ్య ఉద్దేశంగా చెబుతారు. దీని గురించి ఆర్. డబ్ల్యూ. స్కాట్[22] ఈలాగు వివరింస్తున్నారు,

> క్రైస్తవులు మరియు క్రైస్తవేతరుల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని కొండమీది ప్రసంగంలోని ప్రతి అంశంలోనూ స్పష్టంగా కనబడుతుంది. ... క్రైస్తవ విలువలు, నైతిక స్థాయి, మతపరమైన భక్తి, ఆర్థిక వ్యవహారాలలో మెలకువగా ఉండడం, ఆశయాలు, దీవెన విధానం, సంబంధాల పరిపుష్టివంటి విషయాలన్నిటిలోనూ క్రైస్తవుల మరియు యితరుల మధ్య వ్యత్యాసం స్పష్టమవుతుందిక్కడ.[23]

ధన్యతలు గాక మరెక్కడ కూడ ఇంత స్పష్టమైన వ్యత్యాసం మనకు కనబడదు.[24] "ఆత్మ విషయమై దీనులైన వారు ధన్యులు" అని యేసు చెబుతుంటె, "ధనము మరియు గర్వము గలవారు ధన్యులని" లోకం చెబుతుంది. "దుఃఖపడువారు ధన్యులని" యేసు చెబితే, "దుఃఖపడుటకు ఏ కారణంలేని వారు ధన్యులని" లోకం చెబుతుంది. "సాత్వికులు ధన్యులు" అని యేసు చెబితే, "బలవంతులు, ఇతరులను అణగద్రొక్కువారు ధన్యులు" అని లోకం చెబుతుంది. "నీతి కొరకు ఆకలిదప్పులుగలవారు ధన్యులు" అని యేసు చెబితే, "ఈ లోకంలోని వాటికొరకు ప్రాకులాడేవారు ధన్యులు" అని లోకం చెబుతుంది. "కనికరముగలవారు ధన్యులు" అని యేసు చెబితే, "కీడుకు ప్రతికీడు చేయుటకు త్వరపడువారు ధన్యులు" అని లోకం చెబుతుంది. "హృదయ శుద్ధిగలవారు ధన్యులు" అని యేసు చెబితే, "శుద్ధ హృదయం గాక తమ స్వకీయ దురాశలకు చోటిచ్చెడివారు ధన్యులు" అని లోకం చెబుతుంది. "సమాధాన పరచువారు ధన్యులని" యేసు చెబితే "తగాదాపడి గెలుచువారు ధన్యులు" అని లోకం చెబుతుంది "నీతి నిమిత్తము హింసింపబడువారు ధన్యులు" అని యేసు చెబితే "హింసింపబడకుండా, హింసించువారు ధన్యులు" అని లోకం చెబుతుంది.

**ప్రతిఫలము**

ప్రతి ధన్యతకు తగిన ప్రతిఫలము ఉంది. క్రీస్తు రాజ్యములోని నమ్మకమైన వారసులు ఈ ప్రతిఫలాలను పొందుతారు:

- "పరలోక రాజ్యము వారిది."
- "వారు ఓదార్చబడుదురు."
- "వారు భూలోకమును స్వతంత్రించుకొందురు."
- "వారు తృప్తిపరచబడుదురు."
- "వారు కనికరము పొందుదురు."
- "వారు దేవుని చూచెదరు."
- "వారు దేవుని కుమారులనబడుదురు."
- "పరలోక రాజ్యము వారిది. పరలోకమందు వారి ఫలము అధికమగును."

కొన్ని ప్రతిఫలాలు యిక్కడ జీవితానికీ సంబంధించినవిగా ఉండగా, మరికొన్ని రాబోయే

జీవితానికి సంబంధించినవి. అయితే ప్రతిఫలము కొంతవరకు యిక్కడ నెరవేరినా గాని, రాబోయే జీవితములో సంపూర్ణంగా నెరవేరుతుంది. దీని గురించి రాబర్ట్. హెచ్. మౌన్స్ యిలాగు వ్రాస్తున్నారు,

> ధన్యతల పూర్తి నెరవేర్పు న్యాయ తీర్పు రోజున కనబడినా గాని, ప్రస్తుతము వీటిని, వీటి యొక్క ప్రతిఫలములను ఇప్పుడే ఆనందించవచ్చు. 4–9 వచనాల్లో వాడబడిన భవిష్యకాల రూపము వాటి నెరవేర్పు కాలమును గాక వాటిలోని నిశ్చయతను సూచిస్తున్నాయి.[25]

వీటియొక్క పాక్షిక నెరవేర్పు ఇప్పుడు జరిగి, పూర్తి నెరవేర్పు తరువాత కాలంలో జరుగుతుంది కాబట్టి ఈ రెంటింటిని రెండు వేర్వేరు అంశాలుగా భావించకండి. ఈ రెండూ కూడా ఒకే ధన్యతలోని రెండు భాగములు. మీ జీవిత కాలమెంతటిదో మీరెన్నడు చూడని, మీరెల్లప్పుడు ఆశించే ఒక అందమైన ప్రాంతానికి మీరు వెళ్ళుతున్నారనుకుందాం. ఆ ప్రదేశాన్ని గురించిన ఊహాచిత్రాలను మీరు చూసి అక్కడకు వెళ్ళాలని కలలు కంటుండేవారు. ఆఖరకు, అందుకు తగ్గట్టుగా మీ మనస్సును మార్చుకొని ఒక రోజు ప్రయాణమయ్యారు. మీరు ప్రయాణిస్తుండగా, చుట్టు ప్రక్కల మీకు కనబడుతున్న ప్రదేశలు ఎంతో సుందరంగా ఉన్నాయి, ఇన్నాళ్ళు మీకు దేనికోసరమయితే ఎదురు చూస్తున్నారో వాటిని మీరు ఇప్పుడు ఆస్వాదిస్తున్నారు. ఆఖరకు, ఒక మలుపులోకి తిరిగారు – అక్కడ మీరున్నారు. మీ గమ్యాన్ని మీరు చేరుకున్నారు. ఇంతకు ముందెన్నడూ మీరూహించనంత అద్భుతంగా, సుందరంగా ఉందా ప్రదేశం. క్రీస్తు రాజ్యమందలి నమ్మకమైన పౌరునికి జీవితము "యాత్ర" వంటిది, మరియు మరణము "మలుపు తిరగడం" వంటిది.

ధన్యతలలోని పాక్షిక నెరవేర్పు మరియు పూర్తి నెరవేర్పులు ఈ విధంగా ఉంటాయి:

- "ఆత్మ విషయమై దీనులైనవారు ధన్యులు; పరలోక రాజ్యము వారిది." వారు యిప్పుడు క్రీస్తు రాజ్యము (సంఘములో) వారసులయి, పరలోకంలో నిత్యత్వం కొరకు నిరీక్షిస్తుంటారు.
- "దుఃఖపడువారు ధన్యులు; వారు ఓదార్చబడుదురు." వారి యొక్క పాపములు క్షమించబడినందున వారు ఓదార్చబడుతున్నారు. తరువాత వారు దేవుని సన్నిధిలో ఓదార్చబడుదురు.
- "సాత్వికులు ధన్యులు; వారు భూలోకమును స్వతంత్రించుకొందురు." వారు ఈ జీవితములో నిజమైన ఆశీర్వాదాన్ని చూస్తారు. తరువాత ఒక రోజున నూతన భూమిని (పరలోకం) నివాసంగా చేసుకొంటారు.
- "నీతికొరకు ఆకలిదప్పులుగలవారు ధన్యులు; వారు తృప్తిపరచబడుదురు." ఈ లోకములో ఉండగా, వారు దేవుని వాక్యం మరియు ఆయన పోషణచేత తృప్తిపరచబడగా, వారు పరలోకంలో వారి ఆత్మలు సమృద్ధియైన పోషణను చవి చూస్తాయి.
- "కనికరముగలవారు ధన్యులు; వారు కనికరము పొందుదురు." దయ చూపించేవారు దేవునినుండి అలాగే యితరులనుండి దయను పొందుతారు. దేవుని దయయైన నిత్య రక్షణ ద్వారా పరలోకములో ప్రవేశిస్తారు.

- “హృదయశుద్ధిగలవారు ధన్యులు; వారు దేవుని చూచెదరు.” విశ్వాస నేత్రాల ద్వారా వారిప్పుడు దేవుని చూసినా గాని పరలోకంలో ఆయన్ను ముఖాముఖిగా చూస్తారు.
- “సమాధానపరచువారు ధన్యులు; వారు దేవుని కుమారులనబడుదురు.” ఈ రోజున వారు దేవుని కుటుంబమయిన సంఘములో చేర్చబడ్డారు; వారు పరలోకమునకు వెళ్ళిన తరువాత ఈ వారసత్వ ప్రక్రియ సంపూర్ణమవుతుంది.
- “నీతి నిమిత్తము హింసింపబడువారు ధన్యులు; పరలోక రాజ్యము వారిది.” వారు క్రీస్తు కొరకు శ్రమ పడుతున్నారు కాబట్టి వారు ఆనందించవచ్చు. వారి ఫలం పరలోకంలో అధికంగా ఉంటుంది. కాబట్టి వారికనూ ఆనందించవచ్చు.

### ముగింపు

“ఈ ఆధునిక యాంత్రిక దినాల్లో మానవుడికి పనిచేసే జీవన గమ్యం తప్ప మరేది అక్కర లేదు” అని ఈ. స్టాన్లి జోన్స్ అంటున్నారు. ఇందుకోసం ఆయన ఈ దృశ్యాన్ని వివరిస్తున్నాడు. ఆధునిక మనిషి తనను సురక్షితంగా పట్టి ఉన్న తాళ్ళను, బంధాలను తెంచుకుని తన చార్ట్, తన కామ్‌పాస్, నడిపే స్టీరింగ్ చక్రం, గమ్యాన్ని నిర్దేశించే ఇతరమైనవి, తన గమ్యం వీటినన్నింటి విడిచిపెట్టి తన ఓడలోనుండి బయటకు దూకేసి “నాకు స్వేచ్ఛ వచ్చింది, నాకు స్వాతంత్రం వచ్చింది అని అరుస్తున్నాడు.” ఈ ఉపమానమును ముగిస్తూ జోన్స్ యిలా చెబుతున్నాడు. “యిటవంటి పని వలన మానవునికి సముద్రంలో ఎదురయ్యే బండరాళ్ళు, తుఫానులు, అలజడులనుండి తప్ప అతడు అన్ని విధాలా స్వేచ్ఛాపరుడే. అలాగే అర్థం పర్థం లేని భావాలతో అలల చేత కొట్టబడుతూ వెర్రివాడవుచున్నాడు.”[26] మానవుడికి అవసరమైన “పనిచేయు జీవన తత్వాన్ని” కొండమీద ప్రసంగం మాత్రమే అందిస్తుంది. విని మరచిపోవడానికి కొండమీది ప్రసంగము ఒక గాథ కాదు. అలాగే మన నైతిక జీవనాన్ని కొలవడానికి ఉపయోగపడే కొలమానము కాదు ఇది. అది క్రీస్తు యొక్క “సజీవమై బలముగలదైన” వాక్యం (హెబ్రీయులకు 4:12). ఈ వాక్యానికి తన శిష్యులందరు *విధేయులై* అనుసరించాలని ఆయన ఆశిస్తున్నాడు (మత్తయి 7:24–27 చూడు).

కొండ మీది ప్రసంగం యొక్క నిరూపణకు తిరిగి వద్దాం. యేసు ప్రభువు కూర్చుని బోధిస్తున్నారు. నేర్చుకొనుటకు, దాన్ని అమలు చేయుటకు ఆశపడుతున్న ఆయన శిష్యులు ఆయన యొద్ద కూర్చుండగా, ఆసక్తిగా గమనిస్తున్న కొంతమంది, వింటున్న కొంతమంది, ఆశ్చర్యంతో ఉన్న కొంతమంది జనసమూహములు వారి వెనుకగా ఉండి ప్రసంగాన్ని వింటున్నారు. వీరిపైన ప్రసంగం కొంతమేరకు ప్రభావం చూపించింది. మీరు ఈ రోజున ఏ గుంపులో ఉన్నారు. శిష్యుల గుంపులో ఉన్నారా? లేక జనసమూహములో ఉన్నరా? మీరు ఒకవేళ జనమూహంలో ఉంటే, ఈ మన పాఠాలు ముగించక ముందు క్రీస్తు ప్రభువు వ్యక్తిగతంగా ఏర్పాటు చేసిన శిష్యుల గుంపులో మీరు కూడ ఉండేలా మీరు నిర్ణయం తీసుకోవాలని ప్రార్థిస్తున్నాను.

---

సూచనలు

[1]Charles R. Erdman, *The Gospel of Matthew* (Grand Rapids, Mich.: Baker Book House, 1966), 53. [2]Jim Bill McInteer, “The Place, The People, The Preacher,” *20th Century Christian*

*23* (August 1961): 3. [3]John R. W. Stott, *The Message of the Sermon on the Mount*, The Bible Speaks Today series (Downers Grove, Ill.: Inter-Varsity Press, 1978), 15. [4]Erdman, 53. [5]సిలువలో క్రీస్తు చనిపోయేంతవరకు పాత నిబంధన ఆచరణలో ఉంది. క్రీస్తు మరణం తరువాత క్రొత్త నిబంధన అమల్లోకి వచ్చింది (కొలొస్సయులకు 2:14; హెబ్రీయులకు 9:15–17). [6]పాత నిబంధన ఆధారములను క్రొత్త నిబంధన పద్దతులతో త్రిప్పి చెప్పడం తప్పేమి కాదు. ఉదాహరణకు, "నీ అర్పణములను బలిపీఠము యొద్ద అర్పించడం" (5:23) అనేది దేవుని ఆరాధించుటకు రావడమనే అర్థమిస్తుంది. [7]Quoted in E. Stanley Jones, *The Christ of the Mount* (New York: Abingdon Press, 1931), 14. [8]C. G. Wilke and Wilibald Grimm, *A Greek-English Lexicon of the New Testament*, trans, and rev. Joseph H. Thayer (Edinburgh: T. & T. Clark, 1901; reprint, Grand Rapids, Mich.: Baker Book House, 1977), 454. [9]మత్తయి సువార్తలో "శిష్యులు" అనే మాట మొదటిసారిగా ఇక్కడే వ్రాయబడింది. [10]David Roper, క్రీస్తు జీవితం, 1, ట్రూత్ ఫార్ టుడే తెలుగు పుస్తకం చూడు.

[11]A brief word-picture of the setting is found in David Roper, "The Day Jesus Taught on a Mountain," in "Narrative Preaching, 1," *Truth for Today* (February 1997): 26. [12]A. Lukyn Williams, "St. Matthew," *The Pulpit Commentar*y, vol. 15, ed. H. D. M. Spence and Joseph S. Exell (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1950), 146. [13]Jack P. Lewis, *The Gospel According to Matthew, Part 1*, Living Word series (Austin, Tex.: Sweet Publishing Co., 1976), 78. [14]Harvey Scott, *The Sermon on the Mount* (Texarkana, Tex.: The Christian Helper, 1947), 3. [15]ధన్యతలను వరసుగా బోధించుటకు మే 2008 సంచికను చూడు. [16]ఉదాహరణకు, కీర్తనలు 1:1ను చూడండి. ప్రకటన గ్రంథములో ఏడు ధన్యతలున్నాయి (1:13; 14:13; 16:15; 19:9; 20:6; 22:7, 14). [17]R. T. France, *The Gospel According to Matthew*, Tyndale New Testament Commentaries (Grand Rapids, Mich.: Inter-Varsity Press, 1985), 108. [18]Ibid. [19]NASBలో 1 కొరింథీయులకు 7:40లో పదము "సంతోషపరుడుగా" అనువదించబడింది. [20]Ralph Sweet, *Moments on the Mount,* Living Word series (Austin, Tex.: R. B. Sweet Co., 1963), 17.

[21]ట్రూత్ ఫర్ టుడే (మే 2008) సంచికలో ధన్యతల వివరణనుబట్టి ఈ వివరణ ఇయ్యబడింది. దాని గరించి మీరు అధ్యయనం చేయవచ్చు. [22]Stott, 18. [23]Ibid., 19. [24]కాయ్ రోపర్ వ్రాసిన "హౌ టు ఫౌండ్ హాపినస్" నుండి తీయబడింది, Trent church of Christ, Trent, Texas, 1 January 2006లో ప్రసంగించాడు. [25]Robert H. Mounce, *Matthew,* New International Biblical Commentary (Peabody, Mass.: Hendrickson Publishers, 1991), 38. [26]Jones, 9.